సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 21 । ఏప్రిల్ । 2024



అడ్డగోలుగా వడ్డీ దందా

జిల్లాలో వడ్డీ వ్యాపారం అడ్డగోలుగా సాగుతోంది. వ్యాపారులు ప్రజల నుంచి అధిక వడ్డీ వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు.
- 8లో ▸



ప్రజాసమస్యలను ప్రస్తావిస్తా

తనను గెలిపిస్తే ప్రజా సమస్యలపై పార్లమెంలో గళమెత్తుతానని జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ పేర్కొన్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
42.4 /25.0

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

రేపు జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డి ఈ నెల 22న నా మినేషన్ దాఖలు చేయనున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరు కానున్నట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్ కలెక్టరేట్‌లో నా మినేషన్ దాఖలు అనంతరం పాత కలెక్టరేట్ మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభలో రేవంత్ ప్రసంగించనున్నారని పేర్కొన్నారు. సభను విజయవంతం చేయాలని మానాల పిలుపునిచ్చారు.

6, 7 తేదీల్లో కేసీఆర్ పర్యటన

సాక్షి, కామారెడ్డి: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చేనెల 6, 7 తేదీల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన 6వ తేదీన నిజామాబాద్ నగరంలో రోడ్ షోలో పాల్గొంటారు. రాత్రి పట్టణంలోనే బస చేస్తారు. మరుసటి రోజు సాయంత్రం 5.30 గంటలకు కామారెడ్డిలో నిర్వహించే రోడ్‌షోలో పాల్గొంటారు. అనంతరం మెదక్ జిల్లా కేంద్రానికి పయనమవుతారు.

కఠిన పరిస్థితుల్లోనూ ప్రజలను కాపాడతారు



ఖలీల్‌వాడి: అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో కఠిన పరిస్థితుల్లో ప్రజల ఆస్తులు, ప్రాణాలను ఫైర్ సిబ్బంది కాపాడతారని సీపీ కల్మేశ్వర్ అన్నారు. శనివారం అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎత్తయిన అపార్ట్‌మెంట్లలో అగ్ని ప్రమాదాలు జరుగుతున్న సమయంలో ప్రాణాలకు తెగించి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా కాపాడుతున్నారని పేర్కొన్నారు. రిటైర్ అగ్నిమాపక శాఖ ఎంప్లాయీస్‌కు, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అంతకుముందు అగ్నిమాపక సిబ్బంది ఉపయోగిస్తున్న సామాగ్రిని పరిశీలించారు.

అసభ్యకర పోస్టింగ్‌పై సీపీకి ఫిర్యాదు



ఖలీల్‌వాడి: సీతమ్మతల్లి ఫొటోను అసభ్యంగా పెట్టడంతో పాటు.. మరోవైపు రాముడి వేషధారణలో ప్రధాని మోదీ, లక్ష్మణుడి వేషధారణలో అమిషా ఫొటో పెట్టి సోషల్ మీడియాలో పోస్ట్‌చేయడంపై బీజేపీ ఎమ్మెల్యేలు పైడి రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి మండిపడ్డారు. ఈ మేరకు సీపీ కల్మేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. ఆలూరులోని ఓ వాట్సాప్ గ్రూపులో గ్రామానికి చెందిన యువకుడు శనివారం ఉదయం సోషల్ మీడియాలో ఈ పోస్ట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో ఈ పోస్ట్‌పై వివాదం చెలరేగడంతో బీజేపీ ఎమ్మెల్యేలు సీపీకి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో సీతమ్మతల్లిని ప్రతిఒక్కరూ ఆరాధ్యంగా పూజిస్తారని తెలిపారు. దేవతపై అసభ్యకరంగా పోస్టు చేసిన వారిని వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ప్రధాని మోదీ, అమిషాలను రామలక్ష్మణుల వేషధారణలో పోస్ట్‌చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్ట్ వెనుక ఉన్న సూత్రధారులను, పాత్రధారులను పట్టుకొని తగిన విధించే వరకు మా పోరాటం ఆగదని హెచ్చరించారు. దమ్ముంటే రాజకీయంగా ఎదుర్కోవాలి కానీ దేవతామూర్తులను కించ పరిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

నేడు మాంసం దుకాణాలు బంద్

నిజామాబాద్‌నాగారం: మహవీర్ జయంతి సందర్భంగా ఆదివారం మాంసందుకాణాలు మూసి ఉంచాలని నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మంద మకరందు ఆదేశాలు జారీ చేశారు. నగరంలో ఎక్కడ కూడా చికెన్, మటన్ దుకాణాలు తెరిచి ఉంచవద్దన్నారు. స్లాటర్‌హౌజ్ కూడా మూసి వేయనున్నట్లు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి దుకాణాలు తెరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా నగరంలో ఉదయం తనిఖీలు చేయాలని ఎంహెచ్‌వోకు ఆదేశాలు జారీ చేశారు.

మరింత అభివృద్ధి చేస్తా!



సాక్షి ఇంటర్వ్యూ

ఇందూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఐదేళ్ల కాలంలో ఎంతో అభివృద్ధి చేశానని సిట్టింగ్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. ఈసారి గెలిస్తే మరింతగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. పసుపు బోర్డు ఏర్పాటయ్యాక ఈ ప్రాంతానికి పసుపు శుద్ధి కర్మాగారాలు వస్తాయన్నారు. ఇందూరు నగరాన్ని స్మార్ట్ సిటీగా ఎంపిక చేయిస్తానని, జిల్లాలో నవోదయ పాఠశాల, జగిత్యాల జిల్లాలో నవోదయ పాఠశాల, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయిస్తానని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన 'సాక్షి' ఇంటర్వ్యూలో వివిధ అంశాలపై మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

- పసుపు బోర్డుతో ఇందూరు దశ మారనుంది
- పసుపు శుద్ధి కర్మాగారాలు, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ యూనిట్లు రానున్నాయి
- ఇందూరు నుంచి రెగ్యులర్‌గా అయోధ్య, కాశీ, ఢిల్లీ, రాజస్తాన్, ముంబయికి రైళ్లు
- జగిత్యాలకు నవోదయ, కేంద్రీయ, ఇందూరుకు నవోదయ పాఠశాలలు తీసుకొస్తా
- పార్లమెంట్ పరిధిలో మహిళా స్వయం సహాయక గ్రూపులకు రూ. 6,300 కోట్ల రుణాలు
- సమర్థత ఉన్నప్పటికీ కాంగ్రెస్‌లో అసమర్థుడిగా మారుతున్న రేవంత్‌రెడ్డి
- 'సాక్షి' ఇంటర్వ్యూలో సిట్టింగ్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పసుపు బోర్డు మంజూరు కావడంతో ఇందూరుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల దశ మారనుంది. ఇప్పటికే పసు పు పంటకు రికార్డు స్థాయిలో క్వింటాలుకు రూ.20 వేల వరకు ధర తీసుకొచ్చాం. పసుపు బోర్డు ఏర్పాటయ్యాక ఈ ప్రాంతంలో పసుపు శుద్ధి కర్మాగారాలు ఏర్పాటు కానున్నాయి. వీటితో పాటు పసుపు ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ యూనిట్లు వస్తాయి. దీంతో నేరుగా ఇక్కడి నుంచే ఎగుమతులు చేయవచ్చు.

❖ పసుపు బోర్డు కల నెరవేరడంతో రైతులు నా నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఫీజును కూడా వారే చెల్లించారు. ఇక ఈ ఏడాది నిజాంషుగర్స్‌ను ప్రారంభించడంతో పాటు ఇథనాల్ ఉత్పత్తికి పరిశ్రమలు తీసుకొస్తా. చెరుకు, వరి, మొక్కజొన్న ద్వారా ఇథనాల్ ఉత్పత్తవుతుంది. పరిశ్రమలు తీసుకొచ్చి గల్ఫ్‌వలసలు తగ్గించేందుకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ముందుకెళుతున్నాను. ఇందుకు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా పూర్తిస్థాయిలో చేయూతనిస్తున్నారు.

❖ ఇందూరు నగరాన్ని స్మార్ట్ సిటీగా ఎంపిక చేయిస్తా. అలాగే జిల్లాలో నవోదయ పాఠశాల, జగిత్యాల జిల్లాలో నవోదయ పాఠశాల, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయిస్తాను. జిల్లాలో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తాను.

❖ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఉండడంతో అసమర్థుడిగా మారుతున్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు రాకుండా వ్యవహరిస్తున్నారు. కార్డులపై ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ఫొటోలు ఉండాలి. అలా కాకుండా రాజీవ్‌గాంధీ బొమ్మ ఉండాలని పట్టుబడుతుండడంతో ఆయుష్మాన్ భారత్ కార్డులు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం నిలిపేసింది. ఇలాంటి కారణాలతో రేవంత్ అసమర్థత మూటగట్టుకుంటున్నారు.

❖ మోదీ ప్రభుత్వం దేశగతిని మార్చేలా నారీశక్తి వందన్ కింద పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఆమోదించింది. ఆర్టికల్ 370 రద్దు చేసింది. సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్, నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్‌షిప్, కామన్ సివిల్ కోడ్ అమలుకు రంగం సిద్ధం చేసింది. వీటికి సంబంధించి తన స్టాండ్ ఏమిటో చెప్పలేని రేవంత్‌రెడ్డి హిందువెలా అవుతారు.

❖ ఇప్పటికే ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. యువత, మహిళలు, రైతుల నుంచి భారీ స్పందన వస్తోంది. మూడోసారి మోదీ ప్రభుత్వం వస్తే దేశం మరింత ముందుకెళ్తుందని, ప్రపంచవ్యాప్తంగా భారతీయులకు తిరుగులేని గౌరవం వస్తుందని చెబుతున్నారు. నా ప్రచారానికి బీజేపీ జాతీయ నేతలు కూడా హాజరు కానున్నారు. ఈ నెల 25న రెండో సెట్ నామినేషన్ దాఖలు సందర్భంగా మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ రానున్నారు. మే రెండో వారంలో రోడ్‌షో, సభకు మోదీ, అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్‌లలో ఒకరు రానున్నారు.

❖ ఇందూరు పార్లమెంట్ పరిధిలో గత ఐదేళ్లలో మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.6,300 కోట్ల రుణాలు అందించడం జరిగింది. మరోవైపు ఫార్మర్ ప్రొడ్యూసింగ్ యూనిట్లను మంజూరు చేయించాం. ఇక పసుపు రైతులకు బాయిలర్లు, పాలిషర్లు, టార్పాలిన్లు రాయితీతో ఇప్పించాను. నవీపేట-జానకంపేట మధ్య రైల్వే అండర్ బ్రిడ్జి, మాధవనగర్, మామిడిపల్లి, అడవి మామిడిపల్లి, అర్సపల్లి, గోవింద్‌పేట, బోధన్ రైల్వే ఓవర్ బ్రిడ్జిలు మంజూరు చేయించాను. అదేవిధంగా డబ్లింగ్ పనులు పూర్తికాగానే ఇందూరు నుంచి నేరుగా అయోధ్య, కాశీ, ఢిల్లీ, రాజస్తాన్, ముంబాయి వరకు రైలులో ప్రయాణించే సౌకర్యం కలుగనుంది.

జైబోలో హనుమాన్‌కీ..

- 23న ఇందూరులో హనుమాన్ జయంతికి ఏర్పాట్లు
- వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో వీరహనుమాన్ విజయయాత్ర
- కంఠేశ్వర్ నుంచి ఆర్‌ఆర్ చౌరస్తా వరకు సాగనున్న ర్యాలీ
- కాషాయమయం కానున్న నగర వీధులు
- పోలీసుల భారీ బందోబస్తు

సండే స్పెషల్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: 'జై బోలో వీర హనుమాన్‌కీ' నినాదాలతో ఇందూరు నగరం మార్మోగనుంది. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 23న విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నగరంలో భారీస్థాయిలో 'వీర హనుమాన్ విజయయాత్ర' నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు. 14 ఏళ్లుగా అత్యంత వైభవోపేతంగా భారీ భక్తజన సందోహం మధ్య యాత్రను నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం వరుసగా 15వ సారి విజయ యాత్ర నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు నీలకంఠేశ్వర ఆలయం ప్రాంతంలో ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో విశ్వశాంతి మహాయాగం నిర్వహించనున్నారు. అనంతరం జెండా ఊపి విజయయాత్రను ప్రారంభిస్తారు. కంఠేశ్వర్ నుంచి మొదలయ్యే ఈ విజయయాత్ర జిల్లా ప్రజాపరిషత్, నిర్మల్ హృదయ స్కూల్, హమల్‌వాడి, నాందేవ్‌వాడ, శివాజీచౌక్, గంజ్, దేవీరోడ్, భగత్‌సింగ్ చౌరస్తా, గాంధీ చౌక్, హెడ్ పోస్టాఫీస్, పెద్దబజార్ మీదుగా ఆర్‌ఆర్ చౌరస్తా వరకు సాగనుంది. రాత్రి 7 గంటలకు ఆర్‌ఆర్ చౌరస్తా వద్ద భారీ ముగింపు బహిరంగ సభ నిర్వహించనున్నారు. సభలో ప్రధాన వక్తగా ఇందూరు విభాగ ప్రచారక్, తెలంగాణ ప్రాంత సహ బౌద్ధిక్ ప్రముఖ్ నర్రా వెంకట శివకుమార్ వ్యవహరించనున్నారు.



ఇందూరులో హనుమాన్ విజయయాత్ర(ఫైల్)

ఆరు విగ్రహాలు, ఆరు రథాలు సిద్ధం..

విజయయాత్రలో ఆరు రథాలపై ఆరు విగ్రహాలను ఊరేగించనున్నారు. మహాశివుడు, శ్రీరాముడు, దత్తాత్రేయుడు, హనుమంతుడు, భరతమాత, ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాలతో రథాలు ముందుకు కదులుతాయి. అన్ని విగ్రహాలు 20 అడుగుల ఎత్తు ఉంటాయి.

విజయ యాత్ర పొడవునా భక్తులకు దాతలు అల్పాహారం, పులిహోర, మజ్జిగ, పానీయాలు, రాగి జావ, పండ్లు పంపిణీ చేయనున్నారు. యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. దేశం కోసం – ధర్మం కోసం అనే లక్ష్యం, నినాదంతో వీర హనుమాన్ విజయయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విశ్వహిందూ పరిషత్ విభాగ్ కార్యదర్శి తమ్మల కృష్ణ, జిల్లా అధ్యక్షుడు దినేష్ ఠాకూర్, కార్యదర్శి గాజుల దయానంద్, జిల్లా సహకార్యదర్శి ధాత్రిక రమేష్, భజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ యాత్ర కోసం పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ ఆధ్వర్యంలో 1,500 మంది పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించనున్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్లతో భద్రతను పర్యవేక్షించనున్నారు. ఇందుకోసం కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు.

మూడోరోజు ఏడు నామినేషన్లు



కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న స్వతంత్ర అభ్యర్థి చరితా రావు

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

సుభాష్‌నగర్: నిజామాబాద్ లోక్‌సభ స్థానానికి మూడోరోజైన శనివారం ఏడు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. స్వతంత్ర అభ్యర్థులుగా ఆరే రాజేందర్, గంట చరితా రావు, సయ్యద్ అస్గర్, మిర్యాల్‌కర్ జయప్రకాశ్ నామినేషన్లు దాఖలు చేశారు. ఇదివరకే నామినేషన్లు వేసిన స్వతంత్ర అభ్యర్థి రాగి అనిల్, విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థి భుక్యా నందు, బహుజన్ ముక్తి పార్టీ అభ్యర్థి దేవతి శ్రీనివాస్ రెండో సెట్ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందించారు. ఇప్పటివరకు మొత్తం 16 నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు.

పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందించాలి

దేశంలోని పేదలకు విద్య, వైద్యం, న్యాయం అందాలని, నిరుద్యోగం లేకుండా చూడాలనే ఉద్దేశంతో నిజామాబాద్, మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్లు వేస్తున్నట్లు స్వతంత్ర అభ్యర్థి గంటా చరితారావు తెలిపారు. దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు.

జహీరాబాద్‌లో నాలుగు..

కామారెడ్డి క్రైం: జహీరాబాద్ నియోజకవర్గానికి సంబంధించి నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ ఒక సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి క్రాంతి వల్లూరుకు అందజేశారు. ఆయ న నామినేషన్ ప్రక్రియలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లు గంప గోవర్ధన్, హన్మంత్ సింధే తదితరులు పాల్గొన్నారు. టీపీఎస్ అభ్యర్థిగా కొత్త బలిజ బస్వరాజ్, స్వతంత్ర అభ్యర్థులుగా ప్రవీణ్, రామారావు పాటిల్‌లు ఒక్కో సెట్ చొప్పున నామినేషన్లు వేశారు.



సంగారెడ్డి కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ కుమార్

907 ఎకరాల్లో పంట నష్టం



డొంకేశ్వర్ శివారులో నేలకొరిగిన వరి పంట



తడిసిన వడ్లను ఎత్తుతున్న రైతులు

- 891 ఎకరాల్లో వరి, 16 ఎకరాల్లో మామిడి పంటకు దెబ్బ
- అంచనా వేసిన వ్యవసాయ శాఖ అధికారులు

డొంకేశ్వర్(ఆర్మూర్): అకాల వర్షం, వడగళ్లు రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. వర్షం ధాటికి కల్లాల్లో ఆరబోసిన వడ్లు నీళ్లలో కొట్టుకుపోయాయి. కోత దశకు వచ్చిన వరి పొలాల్లోనే నేలవాలింది. చేతికందిన వరి, మామిడి పంటలకు తీవ్ర నష్టం జరగడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. ఈ నెల 19న (శుక్రవారం) సాయంత్రం నుంచి రాత్రి వరకు జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో ఈదురు గాలులతో వడగళ్ల వాన కురిసిన విషయం తెలిసిందే. అయితే, వ్యవసాయాధికారులు ప్రభావిత ప్రాంతాల్లో శనివారం పర్యటించారు. రైతుల నుంచి పంట నష్టం వివరాలను సేకరించారు. మాక్లూర్, నందిపేట్, నిజామాబాద్ రూరల్, డిచ్‌పల్లి, ఇందల్వాయి, నవీపేట్, డొంకేశ్వర్ మండలాలు కలిపి మొత్తం 623 మంది రైతులకు సంబంధించిన 907 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో అత్యధికంగా 891 ఎకరాల్లో వరిపంట, మామిడికి 16 ఎకరాల్లో నష్టం జరిగింది. నివేదికను కలెక్టర్ అనుమతితో ప్రభుత్వానికి పంపించారు.

వడ్లను ఆరబెట్టేందుకు ఎన్నో కష్టాలు

వరి కోతలు పూర్తయిన రైతులు పంటను విక్రయించడానికి కల్లాలకు తరలించారు. వడ్లు ఆరబోసి ముందస్తు జాగ్రత్తగా టార్పాలిన్లు కప్పి ఉంచినప్పటికీ తీవ్రమైన గాలికి అవి ఎగిపోయాయి. దీంతో పలుచోట్ల వర్షం ధాటికి తడిసిన ధాన్యం వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. టార్పాలిన్లు ఉన్నా కూడా వర్షపు నీరు నీరు లోపలికి వచ్చి చేరింది. ధాన్యం తడిసిముద్దవడంతో రైతులు శనివారం కల్లాల్లోనే ఉన్నారు. అయితే, తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు ఎన్నో కష్టాలు పడ్డారు. నీళ్ల చేరిన ప్రాంతం నుంచి వడ్లను వేరేచోటికి తీసుకెళ్లి పోశారు. కుప్పల చుట్టూ, టార్పాలిన్లపై నిలిచిన వర్షపు నీటిని తొలగించారు.

మండలాల వారీగా వరి పంట నష్టం లెక్కలు

మండలం	పంటనష్టం(ఎకరాల్లో)
మాక్లూర్	150
నందిపేట్	230
నిజామాబాద్ రూరల్	189
డిచ్‌పల్లి	45
ఇందల్వాయి	195
నవీపేట్	82

ఇరవై బస్తాల వడ్లు కొట్టుకుపోయాయి



నాలుగు రోజుల క్రితం పంటను కోసి ఆరు ట్రాక్టర్ల ధాన్యాన్ని కల్లానికి తీసుకొచ్చినా. వడ్లు కాంటాకు పోయే సమయంలో వర్షం కురిసింది. కప్పి ఉంచిన టార్పాలిన్లు గాలికి ఎగిరిపోయా యి. దాదాపు 20 బస్తాల వడ్లు వర్షపు నీటిలో కొట్టుకుపోయి తూము కిందికి పోయాయి. నష్టపోయిన నాలాంటి రైతులకు పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలి.

–పెద్ద భూమన్న, తొండాకూర్

శోభాయాత్రను శాంతియుతంగా నిర్వహించాలి

ఖలీల్‌వాడి: జిల్లాలో ఈ నెల 23న హనుమాన్ శోభాయాత్రలను శాంతియుతంగా నిర్వహించాలని సీపీ కల్మేశ్వర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ హాల్‌లో నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని డివిజన్ల పరిధిలో హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరుగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. యాత్ర నిర్వాహకులు, భక్తులు, శోభాయాత్రలో పాల్గొనే ప్రజలు నిబంధనల ప్రకారం నడుచుకుంటూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఎలాంటి పుకార్లను నమ్మవద్దని, ప్రతిఒక్కరూ స్నేహభావంగా ఉండాలని సూచించారు. ప్రజలను రెచ్చగొటే విధంగా స్పీచ్‌లు, పాటలు పెట్టవద్దని పేర్కొన్నారు. ప్రజలను రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టవద్దని.. పటిష్టమైన నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు డీసీపీ(అడ్మిన్) కోటేశ్వరరావు, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, ట్రెయినీ ఐపీఎస్ చైతన్య రెడ్డి, నిజామాబాద్ ఏసీపీ ఎల్.రాజా వెంకట్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, సీఐలు, ఎస్సైలు, విశ్వహిందూ పరిషత్, హిందూ వాహిని, బజరంగ్ దళ్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ కల్మేశ్వర్

స్ట్రాంగ్‌రూంకు చేరుకున్న ఈవీఎంలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలో శనివారం సాయంత్రం పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలు భద్రపర్చినట్లు ఆర్డీవో రాజాగౌడ్ తెలిపారు. మే 13న జరుగనున్న పోలింగ్ కోసం ఆర్మూర్ నియోజకవర్గానికి అవసరమైన 271 ఈవీఎంలు, 303 వీవీ ప్యాట్‌లను స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచామని తెలిపారు. వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించి.. స్ట్రాంగ్‌రూంకు సీల్ వేశామని చెప్పారు. ఆర్డీవో వెంట ఆర్మూర్, మా క్లూర్ తహసీల్దార్లు గజానన్, షబ్బీర్, ఎలక్షన్ డీటీ పద్మ, డిప్యూటీ తహసీల్దార్ హరీశ్, మండల సర్వేయర్ శికారి రాజు, ఆర్‌ఐ అశోక్‌సింగ్, ఎస్సైలు హన్మంత్, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్ రూంకు సీల్ వేసిన ఆర్డీవో రాజాగౌడ్

క్లుప్తంగా

తెయూ పీజీ పరీక్షలు ప్రారంభం



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ రెగ్యులర్‌ సెమిస్టర్‌ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఎంబీఏ, ఎంసీఏ ఆరో సెమిస్టర్‌, ఐఎంబీఏ 10వ సెమిస్టర్‌, ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం ఒకటో సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగినట్లు ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. పీజీ సెమిస్టర్‌ పరీక్షలకు మొత్తం 574 మంది విద్యార్థులకుగాను 551 మంది హాజరు కాగా, 23 మంది గైర్హాజరైనట్లు వివరించారు. వర్సిటీ పరిధిలోని గిరిరాజ్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (నిజామాబాద్‌), ప్రభుత్వ డిగ్రీ కళాశాల(బోధన్‌), తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌ కళాశాల, న్యాయకళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షాకేంద్రాల్లో పీజీ సెమిస్టర్‌ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చంద్రశేఖర్‌ తెలిపారు. గిరిరాజ్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాన్ని చంద్రశేఖర్‌ తనిఖీ చేశారు.

కొనసాగుతున్న బీఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ మొదటి సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షలు మూడో రోజైన శనివారం ప్రశాంతంగా కొనసాగినట్లు ఆడిట్‌సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. మొత్తం 1,311 మంది విద్యార్థులకు గాను 1,257 మంది హాజరుకాగా, 54 మంది గైర్హాజరైనట్లు వివరించారు. వర్సిటీ పరిధిలోని గిరిరాజ్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(నిజామాబాద్‌), ప్రభుత్వ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాల(కామారెడ్డి), ఎస్‌ఆర్‌ఎస్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల(బాన్సువాడ), ఆర్మూర్‌, బోధన్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెంటర్లలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి మే 31వరకు గ్రామీణ ప్రాంతంలో 10 క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల సీనియర్‌ క్రీడాకారులు, జాతీయస్థాయి క్రీడాకారులు, పీఈటీ, పీడీలు ఈ నెల 25లోగా నగరంలోని సుభాష్‌నగర్‌లో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. శిక్షణ ఇచ్చినందుకు రూ.4వేల గౌరవ వేతనం అందిస్తామని, మరిన్ని వివరాల కోసం 77144 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జూలై నుంచి కొత్త చట్టాలు అమలు



ఖలీల్‌వాడి: తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూషన్‌ వైజయంతి ఆదేశాల మేరకు కొత్త చట్టాలపై డిప్యూటీ డైరెక్టర్‌ ప్రాసిక్యూషన్‌ లక్ష్మీనర్సయ్య ప్రాసిక్యూటర్లకు శనివారం అవగాహన కల్పించారు. జిల్లా కోర్టు సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారతీయ న్యాయ సంహిత-2023, భారతీయ నాగరిక సురక్షా సంహిత-2023, భారతీయ సాక్ష్యా అధినియం-2023 చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రాసిక్యూటర్లు రవిరాజ్‌, వసంత్‌, రాజారెడ్డి, శ్యామ్‌రావు, శేషు, దామోదర్‌రెడ్డి, ఖాందేశ్‌ శ్రీనివాస్‌, డాక్టర్‌ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా వడ్డీ దందా

- జిల్లాలో విస్తరించిన వ్యాపారం
- వెయ్యి మందికిపైగానే వ్యాపారులు
- పోలీసుల దాడులపై సర్వత్రా చర్చ



మోర్తాడ్‌(బాల్కొండ): స్థిరాస్తులు, బంగారం తనఖా పెట్టుకుని వడ్డీ వ్యాపారం చేసేవారి సంఖ్య జిల్లాలో వెయ్యి మందికి పైగానే ఉన్నట్లు తెలుస్తోంది. వడ్డీ వ్యాపారం జిల్లాలో అడ్డగోలుగా సాగుతున్న తరుణంలో పోలీసుదాడులపై సర్వత్రాచర్చ నెలకొంది. గడిచిన సోమవారం జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌ల పరిధిలో వడ్డీ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాలపై దాడులను నిర్వహించి 30 మందిపై కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి ఎక్కడ చూసినా వడ్డీ వ్యాపారుల తీరుపైనే చర్చ సాగుతోంది. వ్యవసాయ భూములు, ఇండ్లు, ప్లాట్లను తమ పేర్లపై రిజిస్ట్రేషన్‌ చేసుకుని అధిక వడ్డీకి ఎంత అంటే అంత సొమ్మును అప్పుగా ఇచ్చే వ్యాపారులు కోకొల్లలుగా ఉన్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సందేహాలకు తావిస్తోంది. అలాగే బంగారం నగలు తనఖా పెట్టుకుని ఎక్కువ వడ్డీకి అప్పు ఇచ్చే వ్యాపారులు ఎక్కడ అంటే అక్కడ ఉన్నా వారిని పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వడ్డీ వ్యాపారులను గుర్తించడంలో నిర్లక్ష్యం!

పోలీసు అధికార యంత్రాంగం ఆయా స్టేషన్ల పరిధిలోని వడ్డీ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాలపై దాడులు నిర్వహించాలని ఒక జాబితాను రిలీజ్‌ చేసినట్లు తెలిసింది. అయితే, వడ్డీ వ్యాపారుల జాబితాను తయారు చేయడంలోనే నిర్లక్ష్యం జరిగిందనే వాదన బలంగా వినిపిస్తోంది. పోలీసులు పట్టుకున్నవారిలో చిన్న వ్యాపారులకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు డెయిలీ కలెక్షన్‌ విధానంలో అప్పు ఇచ్చే వడ్డీ వ్యాపారులే ఉన్నారు. వ్యవసాయ భూములకు ఎకరానికి రూ.15లక్షల నుంచి రూ.20లక్షల వరకు నూటికి రూ.3 చొప్పున వడ్డీకి ఇచ్చే బడా వ్యాపారులు పోలీసుల దాడుల నుంచి తప్పించుకోవడం విశేషం. పోలీసు శాఖకు చెందిన నిఘా విభాగం వడ్డీ వ్యాపారుల జాబితాను సరిగా రూపొందించకపోవడంతోనే చిన్నచిన్న ఫైనాన్స్‌లు నిర్వహించుకునేవారినే పోలీసులు పట్టుకున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తహసీల్‌ కార్యాలయాల్లో నిఘా ఉంచితే వ్యవసాయ భూములను తమ పేరిట బదలాయించుకుని వడ్డీకి అప్పు ఇచ్చే వ్యాపారుల గుట్టు బయటపడే అవకాశం ఉంది. రిజిస్ట్రేషన్‌ కార్యాలయాల్లోనూ నిఘా పటిష్టం చేస్తే వ్యవసాయేతర భూములు, భవనాలను తమ పేరిట రిజిస్ట్రేషన్‌ చేయించుకుని వడ్డీ దందా చేసేవారి జాబితా బయటకు వచ్చే అవకాశం ఉంది. పోలీసులు సరైన ప్రణాళిక లేకుండా దాడులు చేశారని, బడా వ్యాపారులకు తప్పించుకునే అవకాశం ఇచ్చారని పలువురు పేర్కొంటున్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి



అవసరానికి అప్పు చేస్తున్నవారి నుంచి అధికంగా వడ్డీ వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. వడ్డీ వ్యాపారులు రోజురోజుకూ తమ ఆస్తులను పెంచుకుంటూ పోతుంటే అప్పులు చేసిన వారు రోడ్డునపడుతున్నారు. ధర్మబద్ధంగా వడ్డీ వసూలు చేసేవారిని వదలిపెట్టి అక్రమార్జనే ధ్యేయంగా బతుకుతున్నవారిపై కఠినంగా వ్యవహరించాలి.

– వినీత్‌కుమార్‌గౌడ్‌, మోర్తాడ్‌

సంకల్పంతో విజయాలు సాధించొచ్చు

నిజామాబాద్‌అర్బన్‌: సంకల్ప బలంతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ యాదగిరి అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. రిజిస్ట్రార్‌ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో విజయం సులువుగా రాదని, నిరంతరం శ్రమించాల్సిందేనని అన్నారు. ఆలోచన బాగుంటే మంచి ఫలితాలు అందుతాయన్నారు. ప్రకృతితోపాటు మన చుట్టూ ఉన్న వారి నుంచి మంచిని నేర్చుకోవాలని సూచించారు. అంతర్గత ప్రతిభకు, సృజనాత్మక శక్తికి పెద్దపీట వేయాలన్నారు. సభాధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్‌ డాక్టర్‌ పి రామ్మోహన్‌రెడ్డి కళాశాల నివేదికను వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ జానపద నృత్యాలు అలరించాయి. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలతోపాటు పతకాలు, బహుమతులను అందజేశారు. వైస్‌ ప్రిన్సిపాళ్లు డాక్టర్‌ రఫీక్‌ అహ్మద్‌, డాక్టర్‌ వేణు, సాంస్కృతిక విభాగం సమన్వయకర్త డాక్టర్‌ అంబర్‌సింగ్‌, డాక్టర్‌ భరత్‌రాజ్‌, డాక్టర్‌ ఆదెప్ప, డాక్టర్‌ సత్యవరప్రసాద్‌, డాక్టర్‌ లక్ష్మీనారాయణ, పీడీ బాలమణి, డాక్టర్‌ ప్రభాకర్‌, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రిజిస్ట్రార్‌ యాదగిరి

ఆంధ్రా మేకల వ్యాపారులతో వాగ్వాదం

నవీపేట: ఉత్తర తెలంగాణలో పేరుగాంచిన నవీపేట మేకల సంతలో జీవాలను కొనుగోలు చేసేందుకు వచ్చిన ఆంధ్రాప్రాంత వ్యాపారులకు శనివారం చేదు అనుభవం ఎదురైంది. కొన్ని వారాలుగా నవీపేట మేకల సంతకు నెల్లూరు జిల్లా కావలి ప్రాంతానికి చెందిన 15 మంది వ్యాపారులు వస్తున్నారు. ఎప్పటిలాగే శనివారం సైతం సంతకు వచ్చారు. అయితే, అధిక ధరలకు జీవాలను కొనుగోలు చేస్తున్నారని, మీ కారణంగా తాము నష్టపోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆరెకటికె వ్యాపారులు కొందరు నెల్లూరు వ్యాపారులతో వాగ్వాదానికి దిగారు. వారు కొనుగోలుచేసిన గొర్రె పొట్టేళ్లు, మేకలను ఎత్తుకెళ్లి దౌర్జన్యం చేశారు. దీంతో నెల్లూరుకు చెందిన వ్యాపారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై యాదగిరిగౌడ్‌ను వివరణకోరగా.. ఫిర్యాదు అందినది వాస్తవమేనని, ఇరు వర్గాలు రాజీమార్గంలో చర్చించుకుంటున్నాయన్నారు.

క్రైం కార్నర్‌

బస్‌షెల్టర్‌లో ఒకరి మృతి



భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామ బస్‌షెల్టర్‌లో శనివారం తెల్లవారుజామున ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సాయికుమార్‌ ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టి మృతుడు లింగంపేట మండలం ఎల్లారం గ్రామానికి చెందిన రుద్రబోయిన సాయిలు(44)గా గుర్తించారు. కామారెడ్డికి ఇల్లరికం వెళ్లిన సాయిలు భార్య స్వప్న, కుమారుడు వరుణ్‌తో కలిసి పట్టణంలోని షేర్‌గల్లీలో నివాసం ఉండేవాడని ఎస్సై తెలిపారు. స్వప్న నాలుగేళ్ల క్రితం మృతి చెందిందని, సాయిలు కామారెడ్డిలోనే ఉంటూ మేస్త్రి పని చేసుకుంటూ జీవించేవాడన్నారు. మేస్త్రి పనిచేసేందుకు పదిహేను రోజుల క్రితం ఇంటి నుంచి బయటికి వచ్చిన సాయిలు శనివారం బస్‌ షెల్టర్‌లో మృతి చెందాడన్నారు. మృతుడి తమ్ముడు ప్రశాంత్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. భార్య మృతి చెందిననాటి నుంచి సాయిలు మానసిక స్థితి బాగోలేదని, ఫిట్స్‌ రావడంతోపాటు తినకపోవడం, ఎండదెబ్బ కారణంగా మృతి చెంది ఉంటాడని ప్రశాంత్‌ ఫిర్యాదులో పేర్కొన్నాడు.

రన్నింగ్‌ ట్రైన్‌ ఎక్కబోతూ మహిళ..



పంచనామా నిర్వహిస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: చావుకు వచ్చి స్వస్థలానికి తిరిగి వెళ్తున్న ఓ మహిళ రన్నింగ్‌ ట్రైన్‌ ఎక్కుతుండగా కిందపడి మృతి చెందింది. ఈ ఘటన శనివారం ఉదయం 6గంటలకు నిజామాబాద్‌ రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కామారెడ్డి పట్టణానికి చెందిన పసుల రేవతి(39) నిజామాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన బంధువు అంత్యక్రియలకు హాజరైంది. శనివారం ఉదయం కామారెడ్డికి వెళ్లేందుకు నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌కు వచ్చింది. రేవతి మూడో నంబర్‌ ప్లాట్‌ఫారంపైకి చేరుకునే సరికి ట్రైన్‌ కదిలింది. ట్రైన్‌ ఎక్కే క్రమంలో ఆమె కాలుజారి కిందపడిపోగా, కాలు, చేయి పూర్తిగా తెగిపోయాయి. రేవతి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం



బాలమల్లయ్య

భిక్కనూరు: మండలంలని జంగంపల్లికి చెందిన బాలమల్లయ్య(60) అదృశ్యమైనట్లు ఎస్సై సాయికుమార్‌ శనివారం తెలిపారు. మానసిక స్థితి సరిగాలేని బాలమల్లయ్య ఈనెల 15వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదన్నారు. భార్య మల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దేశీదారు పట్టివేత



బిచ్కుంద(జుక్కల్‌) : మహారాష్ట్రలోని దెగ్లూర్‌ నుంచి దేశీదారు తీసుకువస్తున్న వ్యక్తిని శనివారం డోంగ్లి వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్‌ సీఐ సత్యనారాయణ తెలిపారు. అలాగే బెల్ట్‌షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తులను పట్టుకున్నామన్నారు. పిట్లం మండలం గుండితండా, డోంగ్లిలోని బెల్ట్‌షాపులపై దాడిచేసి మద్యం సీజ్‌ చేశామన్నారు. బాధ్యులపై కేసులు నమోదు చేశామన్నారు. మహారాష్ట్రకు చెందిన మద్యం రాష్ట్రంలోకి రాకుండా చెక్‌పోస్టుల వద్ద విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో అన్నాదమ్ముళ్లకు తీవ్రగాయాలు

డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లితండా శివారులో 44వ నెంబరు జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్నాదమ్ముళ్లిద్దరికి తీవ్రగాయాలైనట్లు ఎస్సై యూ మహేశ్‌ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నడిపల్లితండాకు చెందిన సోదరులు బట్టు సురేశ్‌, సతీశ్‌ బైక్‌పై ఆస్పత్రికి వెళ్లి తిరిగి వస్తుండగా.. ఆర్మూర్‌ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం తండా శివారులో బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై నుంచి సురేశ్‌, సతీశ్‌ ఎగిరి పడడంతో తీవ్రగాయాలయ్యాయి. ఢీకొట్టిన వావానం కింద బైక్‌ ఇరుక్కుపోగా, డ్రైవర్‌ ఆ వాహనాన్ని ఆపకుండా తీసుకెళ్లాడు. సీఎంసీ వద్ద బైక్‌ను రోడ్డుపక్కన పడేసి వెళ్లిపోయారు. కొద్దిసేపటికి సురేశ్‌ తల్లి ఫోన్‌ చేయగా, ప్రమాదం జరిగిన సమయంలో అటుగా వెళ్తున్న వ్యక్తి లిఫ్ట్‌ చేసి ప్రమాదవిషయం తెలిపాడు. కుటుంబ సభ్యులతోపాటు తండావాసులు ఘటనాస్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. సతీశ్‌ పరిస్థితి విషమంగా ఉందని తండావాసులు తెలిపారు. తండ్రి మాంజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సురేశ్‌ తెలంగాణ యూనివర్సిటీలో జూనియర్‌ అసిస్టెంట్‌ (అవుట్‌ సోర్సింగ్‌)గా పని చేస్తున్నాడు.

లారీ బోల్తా



జక్రాన్‌పల్లి: నాగ్‌పూర్‌ నుంచి హైదరాబాద్‌కు చెప్పుల లోడ్‌తో వెళ్తున్న లారీ మండల కేంద్రంలో శనివారం ఉదయం బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌ సమీర్‌తోపాటు క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి డ్రైవర్‌, క్లీనర్‌కు జక్రాన్‌పల్లిలో ప్రథమ చికిత్స చేయించారు. డ్రైవర్‌ నిద్రలోకి జారుకోవడంతోనే ప్రమాదం జరిగినట్లు తెలిసింది.

పోక్సో కేసు నమోదు

బోధన్‌రూరల్‌: సాలూర మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తిపై పోక్సో చట్టం కేసు నమోదు చేసినట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై నాగనాథ్‌ శనివారం తెలిపారు. బాలిక ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి సదరు వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేశామన్నారు.

కల్లు దుకాణాలపై పోలీసుల దాడి

బాన్సువాడ రూరల్‌: మండలంలోని బుడిమి గ్రామంలోని కల్లుదుకాణాలపై బాన్సువాడ సీఐ మున్నూరు కృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం దాడి చేశారు. కల్తీకల్లుకు తయారీకి వినియోగిస్తున్న ముడిసరుకును స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన మోహన్‌, జీవన్‌, ప్రవీణ్‌గౌడ్‌, సత్యనారాయణకు చెందిన దుకాణాల నుంచి సుమారు రూ.54,900 విలువ చేసే 732లీటర్ల కల్లును సీజ్‌ చేశారు. పరీక్షల నిమిత్తం కల్లు శాంపిళ్లను ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. కల్లును కల్తీ చేస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని సీఐ కృష్ణ హెచ్చరించారు.

గడ్డివాము దగ్ధం

రుద్రూర్‌: మండల కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి గడ్డి వాము దగ్ధమైంది. నెమ్లి జగన్‌కు చెందిన గడ్డి వాముకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకోగా, అటువైపు వెళ్తున్న హనుమాన్‌ మాలధారులు మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. బోధన్‌ నుంచి వచ్చిన ఫైర్‌ ఇంజిన్‌ మంటలను ఆర్పివేసింది. సుమారు రూ.50వేల నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు.




నామినేషన్ల పర్వం..

పార్లమెంట్‌ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. శనివారం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. రిటర్నింగ్‌ అధికారి, జిల్లా కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు నామినేషన్లు స్వీకరించారు.

– సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, నిజామాబాద్‌



రిటర్నింగ్‌ అధికారి, కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతుకు నామినేషన్‌ పత్రాలు అందజేస్తున్న స్వతంత్ర అభ్యర్థులు రాజేందర్‌, అస్గర్‌, మిర్యాలకర్‌ జయప్రకాశ్‌

ప్రజాసమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తా

రుద్రూర్‌: తనను గెలిపిస్తే ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి సేవకుడిగా పని చేస్తానని జహీరాబాద్‌ బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పొతంగల్‌, కోటగిరి, రుద్రూర్‌ మండల కేంద్రాల్లో శనివారం రాత్రి నిర్వహించిన రోడ్‌ షోలలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి గాలి అనిల్‌కుమార్‌ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో ఎంపీలుగా పని చేసిన ఇద్దరు వ్యక్తులు ఈ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. నిరుద్యోగులు, రైతుల సమస్యలపై పోరాటం చేస్తానని, రైల్వేలైన్‌ తీసుకువస్తానని హామీ ఇచ్చారు.

బిల్లులు ఇవ్వకపోతే ఆమరణ దీక్ష చేస్తా

బాన్సువాడ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న డబుల్‌ బెడ్‌ రూం ఇళ్ల బిల్లులు ఇవ్వకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం స్పందించకపోతే ప్రాణత్యాగం చేయడానికైనా వెనుకాడబోనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగానికి లోనై మాట్లాడారు. బిల్లుల కోసం ఎన్నికల తరువాత లబ్ధిదారులతో కలిసి కలెక్టరేట్‌ వద్ద ధర్నా చేస్తానన్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో రూ.400 కోట్ల బిల్లులు ఇప్పించానని, ఇప్పటి కాంగ్రెస్‌ ప్రభుత్వం రూ.30 కోట్ల బిల్లులు ఇవ్వడం లేదన్నారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్‌ గెలిచిందని విమర్శించారు. బీఆర్‌ఎస్‌ అభ్యర్థి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. పోచారం భాస్కర్‌రెడ్డి, పోచారం సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు పత్తి లక్ష్మణ్‌, ఎజాజ్‌ఖాన్‌ తదితరులు పాల్గొన్నారు.



కోటగిరిలో మాట్లాడుతున్న గాలి అనిల్‌కుమార్‌

రెండు రోజుల్లో ముగియనున్న ఒప్పందం

- సమగ్ర శిక్షలో ఈ నెల 24న ఉద్యోగుల తొలగింపు!
- తిరిగి విధుల్లో చేర్చుకునేందుకు ఉత్తర్వులు జారీ చేయని అధికారులు
- అయోమయంలో ఉద్యోగులు

SAMAGRA SHIKSHA ABHIYAN

ఆర్మూర్‌: విద్యా శాఖ పరిధిలోని సమగ్ర శిక్ష విభాగంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్‌, అవుట్‌ సోర్సింగ్‌ ఉద్యోగులతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ఈ నెల 23వ తేదీతో ముగియనుంది. 2023–24 విద్యా సంవత్సరానికి చివరి రోజు కావడం, ఉద్యోగులను విధుల్లో చేర్చుకున్న ఒప్పంద గడువు ముగియడంతో 24వ తేదీన వారు ఉద్యోగాల నుంచి తొలగింపబడతారు. కాంట్రాక్ట్‌, అవుట్‌సోర్సింగ్‌ ఉద్యోగులను 2024–25 విద్యా సంవత్సరానికి తిరిగి విధుల్లో చేర్చుకోవడానికి రాష్ట్ర స్థాయి అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు. దీంతో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ప్రాజెక్టు పరిధిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్‌, అవుట్‌ సోర్సింగ్‌ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది డైరెక్టర్‌ ఆఫ్‌ స్కూల్‌ ఎడ్యుకేషన్‌, సమగ్ర శిక్ష ఎక్స్‌ అఫీషియో స్టేట్‌ ప్రాజెక్టు డైరెక్టర్‌ ఉత్తర్వుల మేరకు ఏప్రిల్‌ 24న ఉద్యోగులను తిరిగి విధుల్లో చేర్చుకున్నారు. దీంతో వారు వేతనాలు నష్టపోయే పరిస్థితి రాలేదు. ఈ ఏడాది సైతం అదే తరహాలో తమను విధుల్లో చేర్చుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు. విధుల్లో నుంచి తొలగించిన రోజు నుంచి తిరిగి విధుల్లో చేర్చుకొనే వరకు వీరికి వేతనాలు సైతం చెల్లించరు. సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయంతోపాటు జిల్లా వ్యాప్తంగా మండల విద్యా వనరుల కేంద్రాల్లో, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో, భవిత కేంద్రాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ పోస్టుల్లో విధులు నిర్వర్తిస్తున్న సుమారు 910 మంది ఉద్యోగులకు ఈ నిబంధనలు వర్తించనున్నాయి.

జిల్లాలో 910 మంది ఉద్యోగులు

కేజీబీవీల్లో బోధన, బోధనేతర సిబ్బంది 571 మంది, యూఆర్‌ఎస్‌ బోధన, బోధనేతర సిబ్బంది 10, డీపీవో సిబ్బంది 9, ఎంఐఎస్‌ కో ఆర్డినేటర్లు 22, డాటా ఎంట్రీ ఆపరేటర్లు 29, ఇన్‌క్లూసివ్‌ ఎడ్యుకేషన్‌ రిసోర్స్‌ పర్సన్స్‌ 49, క్లస్టర్‌ రిసోర్స్‌ పర్సన్స్‌ (సీఆర్పీ) 94, డీఎస్‌ఎంటీలు, పీటీఐలు 88, మెసెంజర్లు 19 మందితోపాటు సిస్టమ్‌ అనలసిస్ట్‌, ఏపీవో, అకౌంటెంట్‌, ఇద్దరు డిస్ట్రిక్ట్‌ టెక్నికల్‌ పర్సన్స్‌, సీజీవీలు 19 మంది, ఇద్దరు నైట్‌ వాచ్‌మెన్లు పని చేస్తున్నారు.

మహిళా సంఘాలతో యూనిఫామ్‌ల తయారీ

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్‌ తయారీ పనులు చేపట్టే అవకాశం వచ్చిందని, సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో సాయాగౌడ్‌ సూచించారు. మండల కేంద్రంలోని టీటీడీసీలో శనివారం ఇందూరు జిల్లా మహిళా పరస్పర సహకార సమాఖ్య (జిల్లా సమాఖ్య) సమావేశం నిర్వహించగా, డీఆర్డీవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యూనిఫామ్‌ తయారీకి సంబంధించిన డబ్బులు అడ్వాన్సుగా వచ్చిన తర్వాతే పనులు చేపట్టాలని సూచించారు. ఒకవేళ ప్రస్తుతం బడ్జెట్‌ రాకున్నా కూడా తర్వాత డబ్బులు ఖచ్చితంగా మంజూరవుతాయన్నారు. జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో 2023–24 రబీ సీజన్‌లో జిల్లాలో 51 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. బ్యాంకు లింకేజీ డీపీఎం నీలిమా మాట్లాడుతూ.. ఎస్‌హెచ్‌జీ సభ్యులకు వ్యక్తిగత రుణాలు రూ.3లక్షల వరకు 55 పైసల వడ్డీ, ఆపై ఉన్న రుణాలకు రూ.1 వరకు వడ్డీని బ్యాంకులు మంజూరు చేస్తాయన్నారు. డీపీఎం సంధ్యారాణి మాట్లాడుతూ.. పని తీరును బట్టి వీవోఏలకు ప్రస్తుతం రూ.3 వేల నుంచి రూ.5వేలకు వేతనాలను పెంచుతారని తెలిపారు. సమావేశంలో ఏపీడీ, డీపీఎంలు శ్రీనివాస్‌, సరోజిని, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ఈ.రాధ, కోశాధికారి ఎల్‌.లక్ష్మి, జిల్లా సమాఖ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్డీవో సాయాగౌడ్‌

డబ్బులు వసూలు చేయొద్దు

సాక్షి ఎఫెక్ట్‌..

నిజామాబాద్‌నాగారం: ఉద్యోగుల వద్ద అక్రమంగా డబ్బులు వసూళ్లు చేసినట్లు తమ దృష్టికి వస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్‌ సుదర్శనం స్పష్టం చేశారు. 'చిరుద్యోగికి వేతన కష్టం' శీర్షికన 'సాక్షి'లో ఈ నెల 20న ప్రచురితమైన కథనంపై డీఎంహెచ్‌వో స్పందించారు. ఈ వ్యవహారంపై కార్యాలయంలో శనివారం ప్రత్యేకంగా సమీక్షించారు. శాఖలో ఉద్యోగుల నుంచి ఇంక్రిమెంట్లు, పదోన్నతు లు, మెడికల్‌ రీయంబర్స్‌మెంట్‌ తదితర వాటికోసం డబ్బులు వసూళ్లు చేయొద్దన్నారు. చిరుద్యోగి నుంచి డబ్బులు తీసుకున్నట్లు తెలిసిందన్నారు. వెంటనే డబ్బులు వెనక్కి ఇచ్చేయాలని, లేనిపక్షంలో విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇన్‌చార్జి ఏవో చందర్‌, ఉద్యోగులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో సుదర్శనం

జానకంపేటలో చోరీ

ఎడపల్లి(బోధన్‌): మండలంలోని జానకంపేటకు చెందిన నీలం లింగన్న ఇంట్లో దుండగులు శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. విద్యుత్‌ సరఫరా నిలిచిపోవడం, ఉక్కపోత కారణంగా ఇంటి తలుపులు తెరిచి లింగన్నతోపాటు కుటుంబ సభ్యులు నిద్రపోయారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలోని సుమారు నాలుగున్నర తులాల బంగారం, 20తులాల వెండి, రూ.25వేల నగదు ఎత్తుకెళ్లారు. ఇంట్లో చోరీ జరిగినట్లు శనివారం ఉదయం గమనించిన లింగన్న పోలీసులకు సమాచారం అందించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు.